# కరువు సమస్య నుండి
# దృష్టి మళ్ళించే కుటిల ఎత్తుగడలు

**దేశంలోనూ,** ఇరు తెలుగు రాష్ట్రాలలోనూ గత రెండు సంవత్సరాలుగా తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు మరింత ఘోరంగా తాండవిస్తున్నాయి. గత సంవత్సరమే రానున్న (ప్రస్తుత) సంవత్సరం కూడా కరువు పరిస్థితులు కొనసాగనున్నాయనే ముందస్తు హెచ్చరికలున్నప్పటికీ దున్నపోతుపై వాన కురిసిన చందాన వ్యవహరించిన ప్రభుత్వాల నిర్వాకం ఫలితంగా కరువు తీవ్రతతో ప్రజానీకం అల్లాడిపోతున్నారు.

దేశంలోని 313 జిల్లాలలోని లక్షా 55 వేల పైగా గ్రామాలలో, 4 లక్షల 44 వేలకు పైబడిన జనవాసాలలో, 33 కోట్ల జనాభా కరువు వాతన బద్దారని కేంద్ర ప్రభుత్వం కరువుపై లోక్‌సభలో చేసిన ప్రకటనలో పేర్కొంది. దేశంలోని 91 ప్రధాన జలాశయాలలో నీటినిల్వలు సాధారణ స్థాయికంటే 24 శాతం తక్కువకు పడిపోయాయని తెలిపింది. ప్రభుత్వ నివేదికే ఇలా వుంటే, వాస్తవానికి కరువు తీవ్రత ఇంకా భయానకంగా వుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలోనూ కరువు తీవ్రత ఇదేవిధంగా వుంది. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు గాను 10 జిల్లాలలో 6978 గ్రామాలు తీవ్ర కరువునెదుర్కొంటున్నాయి. రాష్ట్రంలోని 5 కోట్ల జనాభాలో దాదాపు సగంమంది కరువు బాధితులుగా వున్నారు.

దేశవ్యాపితంగా 12 రాష్ట్రాలలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులపై స్వరాజ్ అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి కరువు పరిస్థితులపై స్పందించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై చురకలు వేసింది.

కొన్ని రాష్ట్రాలలో తీవ్ర కరువు నెలకొన్నప్పటికీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కరువు ప్రాంతాలను పరిగణించి, ప్రకటించకపోవటాన్ని; మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కరువు ప్రాంతాలను ప్రకటించినప్పటికీ కనీస చర్యలు చేపట్టకపోవటాన్ని, ప్రజలకు తాగునీరు, పశువుల మేత వంటి అత్యవసర సదుపాయాలను కూడా కల్పించలేకపోవటాన్ని; ఉపాధి హామీ పనులను వేగిరపర్చి కరువు ప్రాంత ప్రజానీకానికి పనులు కల్పించకపోవటాన్ని ఎత్తిచూపింది. ప్రస్తుత కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి, కరువు సహాయక ఉపశమన నిధి ఏర్పాటు చేసి తక్షణం కరువు ప్రాంత ప్రజానీకాన్ని ఆదుకోవాలని ఆదేశాలిచ్చింది.

ప్రధాన స్రవంతి పత్రికలన్నీ సుప్రీంకోర్టు ఇచ్చిన 53 పేజీల ఈ తీర్పును ప్రస్తుతిస్తూ సంపాదకీయాలు, వార్తా వ్యాఖ్యలు రాశాయి. కరువును ఇప్పటికిప్పుడు కనుగొన్న కొత్త విషయంగానూ, దీనిపై సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చినట్లుగానూ పేర్కొన్నాయి. తప్పితే, దశాబ్దాల కాలంగా పునరావృతమౌతున్న కరువు పరిస్థితుల నెదుర్కొనేందుకు ఇప్పటికే సిద్ధంగా వున్న 'కరువు మాన్యువల్స్'ను అమలుచేయని ప్రభుత్వాల విధానాలపై మౌనం వహించాయి. 'భారతదేశ సమస్య వర్షాలు కురవకపోవడం కాదు. తీవ్ర అలక్ష్యం, ముందుచూపు లేకపోవడం, నీటి వినియోగానికి సరైన ప్రణాళిక లోపించటమే అసలు సమస్య' అని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఛైర్మన్ సునీతా నారాయణ్ వ్యాఖ్యానించారు.

ఈ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నుండే ఉష్ణోగ్రతలు అధికమౌతూ ప్రజలు ముఖ్యంగా తాగునీటి కొరతను, పశుగ్రాసం సమస్యను ఎదుర్కొంటున్నారు. 'సుజలాం సుఫలాం' పేరుతో ఓ పత్రిక ప్రజల భాగస్వామ్యంతోనంటూ చేపట్టి, విస్తృత ప్రచారం కల్పిస్తున్న కార్యక్రమాన్ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము అధికారిక కార్యక్రమంగా చేపట్టి నిధులు విడుదల చేసి రాష్ట్రవ్యాపితంగా యుద్ధ ప్రాతిపదికన ఇంకుడు గుంటలు, పంటకుంటలు తవ్వించే పనులు చేపట్టింది. 1990లలో తెలుగుదేశం అధికారంలోనున్న కాలంలో 'నీరు–మీరు' కార్యక్రమం తీరులోనే 'నీరు–ప్రగతి', 'నీరు–చెట్టు', 'పంటల సంజీవని' వంటి పలు పథకాలతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను తలమానికంగా తీర్చిదిద్దుతామనే వంచనాత్మక ఆర్భాటపు ప్రకటనలు మినహా ఆచరణలో సమర్థవంతంగా కరువు నెదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు శూన్యం. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు 'ఇంకుడు గుంటలు', 'పంటకుంటల' తవ్వకాలతో భూగర్భజలాల పెంపుకు ప్రతి ఒక్కరూ దీక్షబూనాలని ప్రబోధిస్తున్నారు. రాష్ట్రవ్యాపితంగా 10 లక్షలపైగా ఇంకుడుగుంటలు తవ్వాలనే లక్ష్యాన్ని నిర్దేశించి, ఆ వార్తలతోనే రోజూ పుష్కలంగా 'నీటిలో ముంచెత్తుతున్నారు'. రానున్న వ్యవసాయ సీజన్‌లో వర్షాలు మెండుగా కురుస్తాయనే ముందస్తు ప్రకటనలతో జిడిపి రేటు పెరగనుందని అసోచామ్ అంచనాలు వేసిన విధంగానే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇప్పుడు గొంతెండుతున్న గ్రామాలకు గుక్కెడు నీళ్ళివ్వకుండా రానున్న కాలంలో భూగర్భజలమట్టాలు భారీగా పెరగనున్నాయని ఊరిస్తూ ప్రజల్ని జోకొట్టజూస్తున్నాయి.

ప్రకాశం, కర్నూలు, మహబూబ్‌నగర్ వంటి జిల్లాలలో 1700 అడుగులు తవ్వినా భూగర్భజలాలు అందని పరిస్థితులు ఒకవైపు వుంటే, లీటరుకు 5 పైసల లెక్కన చెల్లించి సామ్రాజ్యవాద శీతలపానీయ పెప్సీ, కోకాకోలా, బిస్లరీ వంటి కంపెనీలు లక్షల లీటర్ల భూగర్భ జలాలను శక్తివంతమైన మోటర్లతో తోడిపోస్తున్నా ఈ ప్రభుత్వాలు మిన్నకున్నాయి. నీటి ఎద్దడిని ఆసరాచేసుకొని మంచినీటి

వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. వేసవికాలం 3 నెలల్లో హైదరాబాద్ నగరంలోనే వెయ్యికోట్ల రూ॥ నీటి వ్యాపారం జరుగుతుందనేది అంచనా. గాలి తర్వాత ప్రజల ప్రధాన జీవనావసరమైన నీటిని వ్యాపారమయం చేసి ప్రజాధనాన్ని ఎలా కొల్లగొడ్తున్నారో వెల్లడవుతోంది.

కరువు సహాయక చర్యలలో పాలకుల ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యాన్ని ఎండగట్టాలి. ప్రజలను వంచనకు గురిచేసే బూటకపు పథకాలకు మోసపోకుండా గ్రామీణ, పట్టణ పేదలందరికీ తక్షణం తాగునీరు అందించాలని; గ్రామీణ పేదలందరికీ ఉపాధి కల్పించాలని, పశుగ్రాసం అందజేయాలనే తక్షణ కరువు సహాయకచర్యలను డిమాండ్ చేస్తూ ఉద్యమించాలి. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రవాహంలా సాగుతున్న వలసలను తక్షణం నిరోధించే చర్యలను డిమాండ్ చేయాలి.

దేశంలోనూ, రాష్ట్రాలలోనూ కొన్ని ప్రాంతాలకు సాగునీటి సౌకర్యం కల్పించకుండా, నిరంతర క్షామపీడిత ప్రాంతాలుగా, కారుచౌక శ్రమశక్తి ఎగుమతి కేంద్రాలుగా వుంచాలనే సామ్రాజ్యవాద ఆదేశిత విధానాలను అమలుచేస్తున్న పాలకులపై పోరాడాలి. చెరువులు, కుంటలు, చిన్న రిజర్వాయర్లు, చెక్‌డ్యాంల నిర్మాణం ద్వారా సాగునీరు, తాగునీరే గాక, భూగర్భజల వనరులను పెంపుచేసే దీర్ఘకాల చర్యల అమలుకై ఉద్యమించాలి.

ooooo